# మండుకాలం.. జర భద్రం



**రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు.. జనం ఉక్కిరిబిక్కిరి**

**రోజురోజుకూ ఎండలు మరింతగా మండిపోతున్నాయి. ఒకవైపు తారెత్తించే ఎండలు, మరోవైపు తట్టుకోలేని వేడిమితో కూడిన వడగాలులు, ఇంకోవైపు భరించలేనంతగా ఉక్కపోత అన్ని వెరిసి వేసవిలో ఎండా వేడిమితో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పట్టుమని పది కాక ముందే సూర్యుడు భగ్గున మండిపోతున్నాడు. మండలంలో 36నుంచి సుమారు 40డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండవేడిమిని తట్టుకోలేక రోజువారి కూలీలు, రైతులు, ఉపాధి కూలీలు, చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. ముఖ్యంగా ఎండవేడిమికి వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. తగిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకుంటే సమస్యను అధిగమించవచ్చని మండల వైద్యాధికారులు చెబుతున్నారు.**

**-ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్/యాచారం, మార్చి31**

ఎండదెబ్బకు గురైన వారి శరీరం వేడిగా ఉండి చెమట పట్టదు. చర్మం వేడిగా, పొడిగా మారి ఎర్రబడుతుంది. విపరీత మైన తలనొప్పి, తల తిరుగుడు, కండ్లు తిరిగి పడిపోవడం లాంటి సమస్యలు బాధిస్తాయి. శ్వాస పీల్చుకోవడంలో తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుంది. అలసట, నిస్తత్తువ నెలకొంటుంది. చిరాకు, కంగారు, అపస్మారక స్థితితో ఇబ్బందులెదుర్కొంటారు. గుండెపోటు, వాంతులు, చర్మ సమస్యలు, కండ్ల మంటలు, జుట్టు సమస్యలు సంభవిస్తాయి. వడదెబ్బ తగిలిన వారికి శరీరంలో కనీస నీటి శాతం తగ్గిపోతుంది. నాడీ వేగంగా కొట్టుకుంటుంది. ఒక్కోసారి ఎండదెబ్బ సోకినవారు పూర్తిగా అపస్మారక స్థితికి చేరుకోవడం. నాలుక తడి ఆరిపోవడం వంటి లక్షణాలుగా గుర్తించవచ్చు.

**ఎండదెబ్బ వీరిలో అధికం..**

మొదటగా చిన్నపిల్లలు, వృద్ధులు, స్థూల కాయులు, గర్భిణులు, గుండె జబ్బు వ్యాధిగ్రస్తులు, క్రీడాకారులు, అతిమూత్ర వ్యాధితో బాధపడుతున్నవారు, మద్యపానియాలు సేవించేవారు, కొన్ని రకాల మందులు నిత్యం వేసుకునేవారికి వడదెబ్బ అధికంగా సంభవిస్తుంది.

**ప్రథమ చికిత్స**

ఎండదెబ్బకు గురైన వ్యక్తికి సత్వరమే ప్రథమ చికిత్స చేయాలి. చికిత్సలో ఆలస్యమైతే శరీర అవయవాలు దెబ్బతినడంతో పాటు ప్రాణాపాయస్థితి నెలకొనె అవకాశాలున్నాయి. వడదెబ్బకు గురైన వారిని శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు వెంటనే నీడకు చేర్చాలి. చల్లటి గుడ్డతో శరీరాన్ని తూడ్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి తీసుకొచ్చేలా ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం, నిమ్మరసాన్ని తాగించాలి. వీలైనంత త్వరగా దవాఖానాకు తీసుకెళ్లాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎండలో పనిచేసేవారు గంటకు తప్పనిసరిగా 5లీటర్ల నీటిని తాగాలి. పుచ్చకాయలు, కొబ్బరిబోండం, తాటి ముంజలు, కర్బూజ, జామ, దోసకాయలు, నిమ్మరసం, పండ్లరసం అధికంగా తీసుకోవాలి. చెమట ద్వారా కోల్పోయే లవణాలను తిరిగి పొందేందుకు కొబ్బరినీళ్లు, ఉప్పు పంచదారా కలిపిన నీటిని తాగాలి.

### 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..

మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చాయి. ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రావటానికి జంకుతున్నారు. నాలుగు రోజుల నుంచి నియోజకవర్గంలో సుమారు 40డిగ్రీల ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం ఇండ్లలో నుంచి ప్రజలు బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎప్పుడు రద్దీగా ఉండే బస్టాండు సమీపంతో పాటు అంబేద్కర్ చౌరస్తా, రెవెన్యూ కార్యాలయం, స్టేట్ బ్యాంకు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు ప్రజలు రోడ్లపై లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. ఎండలు తీవ్రం కావటంతో ప్రజలు శీతలపానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. సాగర్ రహదారికి రువైపులా ఉన్న చిరువ్యాపారస్తులు ఎండ ల్లోనే గుడారాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. సాయంత్రం ఐదు దాటిన తర్వాతనే ప్రజలు ఇండ్లనుంచి బయటికి వస్తున్నారు.

**శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ..**

శీతల పానీయాలైన నిమ్మరసం, పండ్ల రసాలకు డిమాండ్ పెరిగిపోతున్నది. ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు శీతలపానీయాలతో కాస్త ఉపశమనం పొందుతున్నారు.

## మూగజీవాల రక్షణకు చర్యలు తప్పనిసరి

ఈ ఎండల తీవ్రతకు మనుషులతో పాటు పశువులు కూడా వడదెబ్బ బారీన పడే అవకాశముంది. వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలామస్ అనే భాగం స్వేద గ్రంథుల మీద పర్యవేక్షణ కోల్పోతున్నది. దీనివల్ల అవి చెమటను అధికంగా ఉత్పత్తి చేస్తాయి. చెమటద్వారా శరీరంలో దాతువులు కోల్పోయి జీవక్రియ దెబ్బతింటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి శ్వాస, గుండె, నాడీమండలం, మూత్రపిండాల విధులు తగ్గిపోయి పశువుల ఆరోగ్యం విషమంగా మారి కోమాలోకి జారుకొని శ్వాస అందక మరణిస్తాయని, దీనికి రైతులు ఎప్పటికప్పుడు పశువులకు ఎలాంటి అపాయం జరగకుండా ఎండలో జాగ్రత్తగా చూసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. మూగజీవాలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించటంతో పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండుసార్లు నీటిలో శుభ్రం చేయాలని పశువైద్యాధికారి సురేశ్‌బాబు తెలిపారు.

**సంరక్షణ చర్యలు..**

ఎండ తీవ్రత నుంచి పశువులను రక్షించడానికి అనుకూలంగా ఉండే గృహ వసతిని కల్పించాలి.

షెడ్‌లో గాలి, వెలుతురు దారాళంగా ప్రసరించడానికి వీలుగా పాకల ఎత్తు సుమారుగా 12అడుగులు ఉండాలి.

షెడ్డుకు ఇరువైపులా ఉండే పక్క గోడలను పూర్తిగా కట్టకుండా 4 నుంచి 6 అడుగుల ఎత్తు వరకు నిర్మించాలి. షెడ్ చుట్టుపక్కలా నీడ ఉండటం కోసం చెట్లను పెంచాలి. వీలైతే షెడ్‌లో షవర్స్, స్ప్రింక్లర్లను అమర్చి, నీటి తుంపర్లు పశు శరీరంపై పడేలా చేయాలి. పశువుల పాకలో అధిక ఉష్ణోగ్రత ఉంటే తట్టుకోలేవు. వడగాలుల తీవ్రత తగ్గించడానికి, షెడ్డుకిరువైపులా పరదాలు, గోనెసంచులను కట్టి, నీటితో తడపాలి.

**మేతను ఇలా అందివ్వాలి..**

పశువులను ఎండ సమయంలో కాకుండా.. కేవలం ఉదయం 6 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు మాత్రమే మేతకు బయట తిప్పాలి. వేసవిలో జీర్ణక్రియ తగ్గుతుంది. కాబట్టి, గంజి, జావా, వంటి పదార్థాలను ఇవ్వడం ఉత్తమం. మేతను చిన్న ముక్కలుగా కత్తిరించి మేపాలి. వరి గడ్డిని జనుముతో కలిపి కూడా మేపవచ్చు. ఉదయం పచ్చిగడ్డి, సాయంత్రం ఎండుగడ్డిని ఇవ్వాలి.

**వడదెబ్బకు గురైతే..**

వడదెబ్బకు గురైన పశువును గుర్తించిన వెంటనే నీడ ప్రదేశానికి తరలించి, చల్లని నీటితో పశువు ముఖాన్ని కడగాలి. ఆ తర్వాత ఐస్‌ను ఒక్లాత్‌తో చుట్టి, పశువు నుదిటిపై చుట్టాలని డాక్టర్లు చెబుతున్నారు. పశువు కోలుకునే వరకు కేవలం చాప్‌కట్‌చేసిన పచ్చిగడ్డిని మాత్రమే అందించాలి. మినరల్ మిక్షర్, ఉప్పు కలిపిన ద్రావణాలను ఇవ్వాలి.

## శీతల పానీయాలు తీసుకోవాలి..

వేసవిలో ప్రజలను వడదెబ్బ ఇబ్బందులకు గురిచేస్తుంది. ఎండ దెబ్బకు గురైన వారికి సరైన సమయంలో ప్రథమ చికిత్సను అందించాలి. టోపీలు, గొడుగులు, కూలింగ్ అద్దాలు వాడాలి. కాటన్ దుస్తులవులను ధరించాలి. రోజుకు 5లీటర్ల నీళ్లు తాగాలి, నిమ్మరసం, పండ్ల రసం, కొబ్బరిబొండాం, పుచ్చకాయలు లాంటి శీతల పానీయాలు తీసుకోవాలి.

**- రాజ్యలక్ష్మి, వైద్యాధికారి యాచారం**

## పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి..

వేసవి కాలంలో పశువులు ఎండల తీవ్రతకు తట్టుకోవు. ఎండలు విపరీతంగా ఉన్నందున వడదెబ్బకు గురై మృత్యువాత పడే అవకాశమున్నది. రైతులు పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళలో బయటకు వదలాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

**- సురేశ్‌బాబు, పశువైద్యాధికారి**

## ప్రవీణ్‌కుమార్‌పై దుష్ప్రచారాన్ని మానుకోవాలి

కడ్తాల్, మార్చి 31: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై వివిధ పార్టీల నాయకులు, ఇతర సంఘాల నేతలు చేస్తున్న దుష్ప్రచారాలు మానుకోవాలని ఆర్ఎస్పీ సపోర్టర్స్ మీట్ అప్ ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్ పేర్కొన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో ఆర్ఎస్పీ సపోర్టర్స్ మీట్ అప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ గోవింద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని ధృడ సంకల్పంతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయాల్లోకి వచ్చారని, అలాంటి నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోనే సాధ్యపడుతుందన్నారు. పార్టీ లకు అతీతంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మహేశ్, మల్లేశ్, ఆర్ఎస్పీ సపోటర్స్ గ్రూప్ నాయకులు ప్రకాశ్ అంబేద్కర్, వరుణ్ పాల్గొన్నారు.

## రుణాలను సకాలంలో చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భరత్‌కుమార్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 31 : రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం ఆర్థిక ప్రగతికి తోడ్పాటు నందించాలని చైర్మన్ భరత్‌కుమార్ యాదవ్ అన్నారు. బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ భరత్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం వ్యవహారాలపై నివేదిక, జమాఖర్చుల అనుమతి కోసం మేనేజర్ ఐలేశ్ సభలో చదివి వినిపించారు. సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించపోవడంతో కొత్త రుణాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. అనంతరం జడ్పీటీసీ దాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సకాలంలో రైతులకు రుణాలు అందించేలా నూతన చైర్మన్, డైరక్టర్లు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ మల్లమ్మాజంగమయ్య, మాజీ చైర్మన్ యాదగిరిరెడ్డి, డైరక్టర్లు చిన్నయాదిరెడ్డి, జైపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, చింతల లక్ష్మమ్మ, బిజిలి బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**చట్టానికి విరుద్ధంగా సంఘం సమావేశం**

సహకార చట్టానికి విరుద్ధంగా సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జరిగిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు సహకార సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించేందుకు 15 రోజుల గడువు ఉంటుందని, ఏడు రోజుల్లోనే సహకార చట్టానికి విరుద్ధంగా నిర్వహించారని ఆరోపించారు. తాను రిజిస్టర్‌లో సంతకం చేయకుండా అడ్డుకోవడం సరైంది కాదన్నారు. నూతన చైర్మన్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అకారణంగా సిబ్బందిని తొలగించడం సరికాదన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి

చేవెళ్లటౌన్, మార్చి 31: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్లలోని సీపీఐ కాలనీలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలంలోని ఎమ్మల్‌సర్వ గ్రామానికి చెందిన అబ్దుల్‌షేక్ మహమ్మద్ (50) ఐదు సంవత్సరాల క్రితం మహమ్మద్ భార్య చనిపోయింది. మూడు సంవత్సరాల నుంచి మహమ్మద్ తన కుటుంబాన్ని వదిలి వారి గ్రామానికి చెందిన బీబీ బేగం, రజియా బేగం, జియాగూడకు చెందిన ఖాదర్లతో కలిసి వివిధ జాతర్లలో బొమ్మలు అమ్ముకుంటూ వారితో కలిసి జీవిస్తున్నాడని పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం బీబీ బేగం, రజియా బేగం, ఖాదర్లతో కలిసి చేవెళ్లకు వచ్చి సీపీఐ కాలనీలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ బెలూన్స్ అమ్ముకుంటూ జీవనం కొనసాగించేవాడు. 30వ తేదీ మధ్యాహ్నం సమయంలో మహమ్మద్ తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే పడుకుడి ఉన్నాడని, రాత్రి 9గంటలకు మహమ్మద్ మృతదేహాన్ని ఒక దుప్పటితో చుట్టి ఇంటి వెనకాల పడి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మహమ్మద్ మృతికి గల కారణాలను పరిశీలించి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

**నందిగామలో..**

భక్షపతి (ఫైల్)

నందిగామ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో జరిగింది. నందిగామ ఎస్సై గోపాల కృష్ణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జంగిలి భిక్షపతి (45) మద్యానికి బానిస కాగా, శనివారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో మంచంపై పడుకున్నాడు. అర్ధరాత్రి మంచంపై నుంచి కింద పడి మృతి చెందాడని మృతుడి తమ్ముడు, కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకొని భిక్షపతి శరీరంపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పన్ను వసూలును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

## పన్ను వసూళ్లు 67 శాతం

పెద్దఅంబర్‌పేట, మార్చి 31: మున్సిపాలిటీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంలో 67 శాతం ఇంటి పన్నులు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.14.48 కోట్లు ఇంటి పన్నుల రూపంలో వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.14.48 కోట్లలోనే గతానికి సంబంధించిన పన్ను బకాయిలు రూ.8 కోట్ల వరకు ఉన్నాయి. మూడు రోజుల కిందట వరకు 50 శాతం వరకే పన్నులు వసూలు కాగా, ఆర్థిక సంవత్సరం చివరలో భారీగా పన్నులు వసూలయ్యాయి. సెలవు రోజు, ఆదివారం అధికారులు ఇంటింటికీ వెళ్లి పాత బకాయిలపై దృష్టి పెట్టారు. దీంతో ఆదివారం సాయంత్రం వరకే రూ.60 లక్షల కుపైగా పన్నులు వసూలైనట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కొంతమందికి చెందిన పన్ను బకాయిలే రూ.5 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కొక్కరి దగ్గర రూ.లక్ష మొదలు, ఐదు లక్షలు, పది లక్షలు, అరకోటి వరకు బకాయిలు ఉన్నాయి. ఇవి పూర్తిస్థాయిలో వసూలైతే లక్ష్యానికి మరింత చేరువయ్యే అవకాశాలు ఉండేవి. మొత్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధికారులు దాదాపు రూ.9.7 కోట్లు వసూలు చేశారు. ఇంటి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీని ప్రజలు చాలా వరకు సద్వినియోగం చేసుకున్నారని, పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## గడ్డిట్రాక్టర్ దగ్ధం

### మంటలార్పిన గ్రామస్తులు

కొత్తూరు, మార్చి 31: ట్రాక్టర్‌పై వెళ్తున్న గడ్డి మోపు విద్యుత్ షాక్‌తో దగ్ధమైన ఘటన కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వరి గడ్డిని ట్రాక్టర్‌పై ఇన్ముల్‌నర్వ నుంచి నాట్కో రోడ్డు వైపు వెళ్తుండగా, కరెంట్ వైరు తెగిపడి మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ ప్రమాదాన్ని నివారించడానికి ట్రాక్టర్‌ను ఊరు అవతలికి తీసుకెళ్లినప్పటికీ మంటలు ఎక్కువయ్యాయి. దీంతో ట్రాక్టర్‌ను విడిచిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు మంటలు ఆర్పారు. దీంతో ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

ఆదిబట్ల, మార్చి 31: గంజాయి తరలిస్తున్న బీహార్‌రాష్ట్రానికి చెందిన వకీల్ కుమార్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన సబీర్‌గాజీ, కొఖాన్‌గాజీలను అరెస్ట్ చేసి రిమండ్‌కు తరలించిన ఘటన ఆదివారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వకీల్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. జితేందర్‌తో పాటు మరో వ్యక్తి సబీర్‌గాజీ, వకీల్‌కుమార్ నుంచి గంజాయి కొనుగోళు చేసేవారు. దానిని వారు తుర్కయాంజాల్ ప్రాంతంలో విక్రయించేవారు. నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన మరోవ్యక్తి కోకన్ ఈ ఇద్దరి నుంచి గంజాయిని కొనుగోళు చేసి అమ్మేవాడు. 15 రోజుల క్రితం జితేందర్ వద్ద 2.2 కేజీల గంజాయిని వకీల్‌కుమార్, సబీర్‌గాజీ కలిసి రూ.25000కు కేజీ చొప్పున కొనుగోళు చేసి 200గ్రాముల గంజాయిని తుర్కయాంజాల్‌లోని మస్కుటి దగ్గరలో ఉండే గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించాడు. మిగిలిన 2 కేజీల గంజాయిని వకీల్‌కుమార్, సబీర్‌గాజీ కేజీ చొప్పున అమ్మడానికి నిల్వ ఉంచారు. రెండు రోజుల క్రితం కోకన్ అనే వ్యక్తి వకీల్‌కుమార్‌కు ఫోన్ చేసి 4కేజీల గంజాయి కావాలని అడిగాడు. దీంతో వకీల్‌కుమార్ నావద్ద 1కేజీ గంజాయి ఉన్నది దానిని అమ్ముదామని వండర్‌లా వద్దకు రావాలని కోరాడు. దీంతో పక్కా సమాచారం అందుకున్న ఎస్ఐ రాజు తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి వారిని పట్టుకున్నారు. వారినుంచి గంజాయితో పాటు 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు వెంకటేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత హస్తకళా ప్రదర్శనకు ఆదరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 31: హబ్సిగూడలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్, సేల్స్ ప్రదర్శనకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్న నేపథ్యంలో ప్రదర్శనను ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. వివిధ రకాల వస్తువులు, సరికొత్త డిజైన్‌లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని భారీగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులను అందించి, వినియోగదారుల మన్ననలను పొందడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగర ప్రజలకు అన్ని రకాలైన ఫ్యాషన్ వస్త్రాలన్నింటిని ఒకే వేదికపైకి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కళాసిల్క్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు.

## వేద పాఠశాల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్‌టౌన్, మార్చి 31: ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ శివారులోని కాశి వేద పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం వేద పాఠశాలలో కాశీ జగద్గురు చంద్ర శేఖర శివచార్యస్వామి ఆశీస్సులు తీసుకున్న అనంతరం మాట్లాడారు. జగద్గురు ఆశీర్వదంతోనే వేద పాఠశాల దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థుల వేద మంత్ర పారాయణంతో వేద పాఠశాల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందని చెప్పారు. అనంతరం పట్టణానికి చెందిన సురేశ్‌కుమార్ సహకారంతో వేద పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్ విశాల, వేద పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సజ్జల కాశీనాథ్, బసవేశ్వర్, భువనేశ్వర్, అర్చకుడు సంగయ్య, నాయకులు చెన్నయ్య, తిరుపతిరెడ్డి, నందు, జగదీశ్వర్, రవితేజ, రాజేశ్, మాణిక్యం, రాఘవేందర్, రామ్మోహన్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణం

**లక్ష్మీనరసింహ స్వామికి భక్తుల పూజలు**
**పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 31 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామ పరిధిలోని మహమ్మాయిపురంలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ మహమ్మాయిదేవి రథోత్సవాల్లో భాగంగా అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ట్రస్టీ సభ్యుడు ఎర్రవెల్లి మారుతిప్రసాద్, ఎర్రవెల్లి కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దాస్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేత

షాబాద్, మార్చి 31: షాబాద్ మండలంలోని సాయిరెడ్డిగూడ గ్రామంలోని మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ నగరానికి చెందిన ఎం. జయలక్ష్మి రూ.1.51లక్షల విరాళం అందజేశారు. అదే విధంగా సంగారెడ్డి రూ.4లక్షల విరాళం అందజేయడం జరిగింది. షాబాద్‌కు చెందిన వ్యాపార వేత్త దండు విశ్వనాథం రూ.51వేలు, ఎంపీటీసీ అశోక్ రూ.51వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

## బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ కుట్ర

చేవెళ్ల టౌన్, మార్చి 31: బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసిన మరోసారి బీజేపీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

**కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో**

## గెలిపించుకుందాం

**బీఆర్ఎస్ పార్టీ నాయకుడు భూపాల్‌రెడ్డి**

షాబాద్, మార్చి 31: బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గంగిడి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల గొంతుక అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు పెద్ద ఎత్తున విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి నాయకత్వంలో చేవెళ్లలో కాసాని గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు.

**జలమండలి**

## ఉద్యోగిపై దాడి

బండ్లగూడ, మార్చి 31: మంచినీటిని వృథా చేయవద్దు అని చెప్పిన పాపానికి ఓ వాటర్ లైన్‌మెన్‌పై దాడిచేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు